

నేడు జాతీయ ఎస్‌టి కమిషన్‌సభ్యుడు రాక



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జాతీయ ఎస్‌టి కమిషన్ సభ్యుడు అనంత నాయక్ ఆదివారం సోంపేట మండలంలో పర్యటించనున్నట్లు సీతంపేట ఐటిడిఎ పిఒ బి.నవ్య తెలిపారు. శనివారం ఆమె ఒక ప్రకటనను విడుదల చేశారు. ఆదివారం సాయంత్రం 4గంటలకు సోంపేట తహశీల్దార్ కార్యాలయంలో గిరిజనులతో సమావేశం కానున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి గిరిజన ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, ప్రతినిధులు, గిరిజనులు హాజరై, తమ సమస్యలపై వినతులు అందజేయవచ్చని కోరారు.

మోటార్లకు మీటర్ల ఏర్పాటు విఫలం

- కిడ్నీ వ్యాధి నియంత్రనకు సమగ్ర చర్యలు చేపట్టాలి
- వంశధార నిర్వాసితులకు అరకొర సాయం
- పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం ప్రతినిధి

విద్యుత్ సంస్కరణల్లో భాగంగా జిల్లాలో పైలట్ ప్రాజెక్టుగా చేపట్టిన వ్యవసాయ మోటర్లకు మీటర్ల ఏర్పాటు విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు అన్నారు. శనివారం శ్రీకాకుళం నగరం స్థానిక ఇందిరానగర్ కాలనీలోని సిపిఎం జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలో మీటర్లు ఏర్పాటు చేయడం వల్ల 30శాతం కరెంట్ ఆదాతో పాటు నాణ్యత పెరిగిందని చెప్పడం ఇంతకన్నా హాస్యాస్పదం మరొకటి లేదన్నారు. విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల వల్ల మోటార్లు కాలిపోతాయి తప్ప మీటర్లు ఏర్పాటు చేస్తే కాలకుండా ఉంటాయా అని ప్రశ్నించారు. జిల్లాలో ఏర్పాటు చేసిన మీటర్లలో 20శాతం పాడయినవని చెప్తున్నారని, 30 శాతం కరెంట్ ఆదా అయిందని ఎలా చెప్తున్నారని ఆయన ప్రశ్నించారు. విద్యుత్ మీటర్ల ఏర్పాటులో విఫలమైందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ అని, అటువంటిది రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న రైతులపై ప్రభుత్వం రుద్దాలని చూస్తోందని విమర్శించారు. ఉద్దానం ప్రాంతంలో కిడ్నీ బాధితులకు సాయం చేస్తున్నామని, మందులు ఇస్తున్నామని చెప్తున్నా అవేవీ సత్ఫలితాలు ఇవ్వడం లేదన్నారు. పలాసలో కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ఎప్పటికి పూర్తవుతుందో తెలియదన్నారు. వ్యాధిని కూడా అరికట్టలేకపోయారని విమర్శిచారు. ప్రభుత్వం తీసుకున్న కంటితుడుపు చర్యలతో కిడ్నీ వ్యాధిని నియంత్రించలేకపోయారని విమర్శించారు. ఆస్పత్రుల్లో వైద్యులు, మందులు అందుబాటులో ఉంచడంతో పాటు మంచినీటిని అందించాలని డిమాండ్ చేశారు. కిడ్నీ వ్యాధి నియంత్రణకు ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. రణస్థలం మండలం కొవ్వాడలో ప్రమాదకరమైన అణు విద్యుత్కేంద్రం ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడం సరికాదన్నారు. గుజరాత్ ప్రభుత్వం, అక్కడి ప్రజలు తిరస్కరించిన తర్వాత వాళ్ల రాష్టానికి ఏ ప్రమాదం రాకుండా ఇక్కడ ఏర్పాటు చేస్తున్నారని చెప్పారు. ఉత్తరాంధ్ర, జిల్లాకు ఏ నష్టం జరిగినా పర్వాలేదనుకుంటున్నారని విమర్శించారు. అమెరికా, యూరప్ దేశాల్లో మూసేస్తున్నారని ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వస్తోందన్నారు. అణు విద్యుత్కేంద్రం ఏర్పాటుతో పర్యావరణానికి, సకల ప్రాణ కోటికి తీవ్ర ముప్పు అన్ని పేర్కొన్నారు. రాష్ట్రంతో పాటు జిల్లా ప్రజలను బలి చేయడానికి ఇక్కడకు తీసుకొచ్చి పెడుతున్నారా? అని ప్రశ్నించారు. అణు విద్యుత్కేంద్రాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ పెట్టడానికి వీల్లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వం దాన్ని తిరస్కరించాలని డిమాండ్ చేశారు. అణు విద్యుత్కేంద్రానికి వ్యతిరేకంగా ప్రజలు చేపట్టే ఆందోళనలకు మద్దతిస్తామని చెప్పారు

వంశధార నిర్వాసితులకు పూర్తి స్థాయిలో పరిహారం ఇవ్వలేదన్నారు. ప్రతిపక్ష నేతగా 2007లో హిరమండలంలోని బ్యారేజీ సెంటర్‌కు వచ్చిన ఆయన నిరాహార దీక్షా శిబిరాన్ని సందర్శించి 2013 భూ సేకరణ చట్టం అమలు చేసి న్యాయం చేస్తామని చెప్పారని గుర్తు చేశారు. అధికారంలోకి వచ్చిన దాదాపు నాలుగేళ్ల అయినా న్యాయం జరగలేదని చెప్పారు. నిర్వాసితులకు అరకొర సాయంతో చేతులు దులుపుకున్నారని విమర్శించారు. నిర్వాసితులను మోసం చేయడం సరికాదన్నారు. తక్షణం నిర్వాసితులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం నిర్వాసితులకు సాయం చేయాలని డిమాండ్ చేశారు. నేరడి బ్యారేజీ ప్రాజెక్టును వెంటనే పూర్తి చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, బి.కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మీ త్యాగం జిల్లా ప్రగతికి మార్గనిర్దేశం

- మంత్రులు ధర్మాన ప్రసాదరావు, అప్పలరాజు
- భావనపాడు పోర్టు నిర్వాసిత రైతులకు చెక్కుల పంపిణీ
- మూలపేట మాజీ సర్పంచ్ గృహ నిర్బంధం
- ప్రభుత్వ భూముల పరిహారంపై రాని స్పష్టత



రైతులకు పరిహారం చెక్కును అందిస్తున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి - నౌపడ

జిల్లా ప్రగతికి మార్గ నిర్దేశం మూలపేట, విష్ణు చక్రం గ్రామాల నుంచి ప్రారంభమైందని రాష్ట్ర రెవిన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు, మంత్రి సీదిరి అప్పలరాజు అన్నారు. మూలపేట గ్రామంలో భావనపాడు పోర్టు నిర్మాణానికి భూములు త్యాగం చేసిన రైతులకు పరిహారం చెక్కులను శనివారం అందజేశారు. ఎకరా భూమికి 25 లక్షలు చొప్పున మొత్తం 312 ఎకరాలకు 454 మంది రైతులకు రూ.78.10 కోట్లు పరిహారం చెల్లించేందుకు నమూనా చెక్కును శనివారం రైతులకు అందించారు. తొలివిడతగా వంద మంది రైతులకు రూ.20 కోట్లు అందించనున్నారు. దీనిలో భాగంగా 20 మంది రైతులకు మంత్రులు చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ ప్రస్తుతం ప్రాజెక్టుల నిర్మాణానికి భూ సేకరణ జరిలమైందని అన్నారు. జిల్లాలో సహజ వనరులు ఉన్నా గత పాలకుల వివక్ష వల్ల నిర్లక్ష్యానికి గురైందని అన్నారు. మూలపేట నుండి జిల్లా ప్రగతి మలుపు తిరుగుతుందని పేర్కొన్నారు. పోర్టు ద్వారానే కాక అనుబంధ పరిశ్రమల ద్వారా ఈ ప్రాంత యువతకు ఉపాధి కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పడ్డాక రూ.700 కోట్లతో ఉద్దానంలో తాగునీటి ప్రాజెక్టు శరవేగంగా ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఉద్దానం కిడ్నీ రోగులకు రీసెర్చ్ సెంటర్లు ఏర్పాటు చేసి ఆస్పత్రి నిర్మిస్తున్నామని తెలిపారు. రూ.3వేల కోట్లతో నిర్మిస్తున్న భావనపాడు పోర్టు ఎన్నో ఇండస్ట్రీలు తీసుకురావడానికి దోహదపడుతుందని తెలిపారు. అనంతరం మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి అప్పలరాజు మాట్లాడుతూ జిల్లా అభివృద్ధి చెందాలని, పోర్టు నిర్మాణం కావాలని ఈ ప్రాంత వాసుల కల నెరవేరబోతుందన్నారు. భూసేకరణలో ఎటువంటి లోపాలు ఉన్నా గుర్తించి ప్రతి సెంటుకూ పరిహారం చెల్లిస్తామని కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ తెలిపారు. పరిహారం సొమ్మును వృథా చేయకుండా జాగ్రత్త పడాలని రైతులకు సూచించారు.

మూలపేట మాజీ సర్పంచ్ గృహ నిర్బంధం

మూలపేట మాజీ సర్పంచ్ జీరు భీమారావును పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు ఆయనను నిర్బంధంలో ఉంచారు.

కార్యక్రమంలో ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, వైసిపి జిల్లా అధ్యక్షులు ధర్మాన కృష్ణదాస్, కేంద్ర మాజీ మంత్రి కృపారాణి, కళింగ కార్పొరేషన్ చైర్మన్ పేరాడ తిలక్, తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, సబ్ కలెక్టర్ రాహుల్‌కుమార్ రెడ్డి, మూలపేట సర్పంచ్ బాబురావు, జెడ్‌పిటిసి వసంతరెడ్డి, ఎంపిపి రాజేశ్వరి, అప్పారావు, ఎన్.చింతామణి, తహశీల్దార్ చలమయ్య, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఆర్‌జెడ్ భూముల పరిహారంపై రాని స్పష్టత

రైతుల ఆధీనంలో ఉన్న ప్రభుత్వ (సిఆర్‌జెడ్) భూములపై ఇప్పటికీ స్పష్టత కరువైంది. వీటికి ఎంత పరిహారం ఇస్తారు, ఏ విధంగా ముందుకు వెళ్తారన్న విషయంపై నాయకులు, అధికారులు స్పష్టత ఇవ్వలేదు. గతంలో వీటికి పరిహారం చెల్లిస్తామని పలు సందర్భాల్లో మంత్రి అప్పలరాజు, కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ చెప్పినా ప్రస్తుతం వాటి ప్రస్తావన లేదు. మరోవైపు పోర్టు నిర్మాణానికి మూలపేట గ్రామస్తులు అనుకూలం, వ్యతిరేకంగా రెండు గ్రూపులుగా విడిపోయారు. పోర్టు నిర్మాణానికి వ్యతిరేకంగా ఉన్న గ్రూపు చెక్కులు పంపిణీ కార్యక్రమానికి హాజరు కాలేదు.



మాట్లాడుతున్న జెసి నవీన్

వినియోగదారులకు సత్వర న్యాయం

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

వినియోగదారులకు నష్టం కలిగితే వారికి సత్వర న్యాయం అందేలా చూడాలని సంయుక్త కలెక్టర్ ఎం.నవీన్ అన్నారు. నగరంలోని బాపూజీ కళామందిర్‌లో పౌర సరఫరాల సంస్థ ఆధ్వర్యంలో వినియోగదారుల ఫోరం చైర్మన్ బగాది రామ్మోహన్‌రావు అధ్యక్షతన జాతీయ వినియోగదారుల దినోత్సవం శనివారం నిర్వహించారు. జెసి మాట్లాడుతూ వినియోగదారులు నష్టపోకుండా ఉండేందుకు, మోసపూరిత వ్యాపారస్తులకు అడ్డుకట్ట వేయాలనే లక్ష్యంతో వినియోగదారుల చట్టం అమల్లోకి తీసుకురావడం జరిగిందన్నారు. అయితే ఈ చట్టం గురించి సరైన అవగాహన లేనందున కొందరు వినియోగదారులు ఇప్పటికీ నష్టపోతున్నారని, ప్రజలందరికీ ఈ చట్టం అర్థమయ్యేలా అవగాహన కల్పించాల్సిన ఆవశ్యకత ఉందని చెప్పారు. వినియోగదారులు తమ కొనుగోలు చేసిన వస్తువులపై పూర్తి అవగాహన కలిగినప్పుడు, కొనుగోలు చేసిన వస్తువు నిర్దేశించిన ప్రమాణాల్లో ఏమైనా లోపం ఉంటే వారికి ప్రశ్నించే హక్కు ఈ చట్టం ద్వారా ఏర్పడిందని, తద్వారా లబ్ధి పొందగలుగుతారని పేర్కొన్నారు. జిల్లా వినియోగదారుల వివాదాల పరిష్కార కమిషన్ చైర్మన్ రఘుపాత్రుని చిరంజీవి మాట్లాడుతూ వినియోగదారుల హక్కులు, చట్టం గురించి ప్రతిఒక్కరూ తెలుసుకోవాలని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వినియోగదారుల హక్కులను కాపాడేందుకు అధిక మొత్తంలో నిధులు ఖర్చుచేస్తున్న సంగతిని ఆయన గుర్తుచేశారు. కేసు వేసిన 180 రోజుల్లో పరిష్కరించడం జరుగుతుందన్నారు. వినియోగదారులకు సత్వర న్యాయం అందించడమే కమిషన్ ముఖ్య ఉద్దేశమన్నారు. పోర్టల్ ద్వారా టోల్ ఫ్రీ నెంబర్ 1800114000,1915 కాల్ చేసి ఫిర్యాదు చేయవచ్చన్నారు. అనంతరం జాతీయ వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వివిధ కళాశాలలో నిర్వహించిన వివిధ పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రశంసాపత్రాలు, పతకాలు, నగదు బహుమతులను జెసి అందజేశారు. తొలుత వినియోగదారులకు అవగాహన కల్పించేందుకు డ్రగ్ కంట్రోల్, తూనికలు కొలతలు, హెచ్‌పి గ్యాస్, ఇతర శాఖలు ఏర్పాటుచేసిన స్టాల్స్‌ను జెసి ప్రారంభించారు.

అనంతరం జిల్లా వినియోగదారుల సభ్యులు చిరంజీవిని ఘనంగా సత్కరించారు. జిల్లా పౌర సరఫరాల శాఖ ముద్రించిన మేలుకొలుపు పుస్తకాన్ని ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా పౌరసరఫరాల అధికారి డి.వెంకటరమణ, డిఇఒజి.పగడాలమ్మ, తహశీల్దార్ కె.వెంకటరావు, జిల్లా వినియోగదారుల ఫోరం సభ్యులు రాధారాణి, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ పి.జయంతి, మార్కెటింగ్ శాఖ సహాయ సంచాలకులు కైలాసరావు , సెట్‌శ్రీ సిఇఒ బి.వి.ప్రసాదరావు, గంజి ఆర్ఎజ్రా, ప్రభుత్వ మహిళా కళాశాల వినియోగదారుల క్లబ్ కన్వీనర్ ఎల్.కృష్ణారావు, దేవిశ్రీ ఎంటర్ ప్రైజెస్ గ్యాస్, ఇతర శాఖల అధికారులు, ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో వినియోగదారులు తదితరులు పాల్గొన్నారు.

'క్రిస్'మస్తు సందడి

- విద్యుత్ దీపాల అలంకరణలో చర్చిలు
- శాంటాక్లాస్ వేషధారణలో చిన్నారులు



ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్


జిల్లావ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలను సందడిగా నిర్వహించారు. అన్ని చర్చిల్లో శనివారం సాయంత్రం నుంచే చర్చిల్లో వేడుకలు ప్రారంభమయ్యాయి. అర్ధరాత్రి కేకును కోసి ఏసుక్రీస్తును స్తుతిస్తూ గీతాలను ఆలపించారు. శ్రీకాకుళం చిన్నబజారులోని తెలుగు బాప్టిస్టు చర్చి, ఉమెన్స్ కాలేజ్ రోడ్డులోని క్రిస్టియన్ వర్షిప్ సెంటర్, కోడి రామ్మూర్తి స్టేడియం సమీపంలోని సెయింట్ జాన్ లూథరన్ చర్చి, డగ్లస్ స్కూల్ క్యాంపస్‌లోని కీన్‌స్టోన్ చర్చి, పాత శ్రీకాకుళంలోని రార్డ్ అసెంబ్లీ చర్చి, పురుషుల డిగ్రీ కళాశాల సమీపంలోని ఆర్‌సిఎం చర్చి, టౌన్‌హాల్ వద్ద సెయింట్ థామస్ చర్చితో పాటు జిల్లా వ్యాప్తంగా పలు చర్చిల్లో వేడుకలను ఘనంగా నిర్వహించారు.

'శర్వాణి'లో ముందస్తు క్రిస్మస్ వేడుకలు


నగరంలోని అరసవల్లి రోడ్డులోని శర్వాణి విద్యాలయంలో ముందస్తు క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. డాక్టర్ కె.రేఖ క్రీస్తు బోధనలు, మతంలో ఉన్న మంచిని గ్రహించాలని సూచించారు. శాంటాక్లాస్ వేషధారణలు అందరినీ ఆకట్టుకున్నాయి.ఈ సందర్భంగా విద్యార్థులకు ఆమె క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎ.ఆంజనేయులు, డైరెక్టర్ అంధవరపు సూరిబాబు, తదితరులు పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న చిన్నారులు



విద్యుత్ కాంతుల్లో శ్రీకాకుళంలోని ఓ చర్చి



ఇచ్ఛాపురంలో..

స్వచ్ఛమైన తాగునీరు అందించడమే లక్ష్యం

ప్రజాశక్తి - బూర్జ

ప్రతి గడపకు జలజీవన్ మిషన్ ద్వారా స్వచ్ఛమైన తాగునీరు ప్రతి ఒక్కరికీ అందించడం లక్ష్యమని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. మండలంలోని అయ్యవారిపేటలో రూ.59 లక్షలతో జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ మంచినీటి కుళాయి కార్యక్రమానికి స్పీకర్ తమ్మినేని సీతారాం శనివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండు నదుల మధ్య ఉన్నప్పటికీ తాగునీరు, సాగునీటి కోసం ఇబ్బంది పడుతున్నామని, దాన్ని అధిగమించేందుకు ఈ కార్యక్రమాలు చేపట్టామని తెలియజేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ ఎస్.రమణారావు, ఎంపిడిఒ రవీంద్రబాబు, ఎంపిపి కర్నేన దీప, జెడ్‌పిటిసి బెజ్జిపురపు రామారావు, కండాపు గోవిందరావు, వైస్ ఎంపిపిలు బుడుమూరు సూర్యారావు, కరణం కృష్ణంనాయుడు, పిఎసిఎస్ అధ్యక్షులు బగాది నారాయణమూర్తి, మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు గుమ్మడి రాంబాబు, డిసిఎంఎస్ డైరెక్టర్ జొల్లు బలరాంనాయుడు, సర్పంచ్‌లు, ఎంపిటిసిలు, తదితరులు పాల్గొన్నారు.

గృహ సారథ్యమా?.. శల్య సారథ్యమా?

ప్రజాశక్తి-శ్రీకాకుళం ప్రతినిధి

పార్టీని, కార్యకర్తలను విస్మరించి వాలంటీర్లను నమ్ముకున్న వైసిపికి ఇప్పుడు అసలు తత్వం బోధపడినట్లు ఉంది. లబ్ధిదారులకు అందిస్తున్న సంక్షేమ పథకాలు జనానికి చెప్పుకోవడంలో వెనుకబడినట్లు గుర్తించింది. వాలంటీర్లు వారికి అప్పగించిన పనికే పరిమితమవ్వడంతో ప్రభుత్వానికి అనుకున్న స్థాయిలో క్రెడిట్ దక్కడలేదు. మరో ఒకటిన్నర ఏళ్లలో సార్వత్రిక ఎన్నికలు జరగనుండటంతో పార్టీని బలోపేతం చేయడంపై దృష్టి సారించింది. పింఛన్లు, ఇళ్లు, ఆసరా, చేయూత తదితర సంక్షేమ పథకాలు ఎవరు అమలు చేస్తున్నారో జనంలోకి బలంగా తీసుకువెళ్లాలని సంకల్పించింది. అందులో భాగంగానే సచివాలయ స్థాయిలో పార్టీని బలోపేతం చేసేందుకు ఒక కార్యక్రమం రూపొందించింది. సచివాలయ పరిధిలో ముగ్గురు కన్వీనర్లు నియమించడానికి సిద్ధమవుతున్నారు. ఇది కాక వాలంటీరుతో పాటు ఇద్దరు గృహ సారథులను నియమించడానికి సమయాత్తమవుతున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ఎంపికలో తమకు ప్రాధాన్యం ఇవ్వడం లేదంటూ ఇప్పటివరకు సర్పంచ్ నుంచి ఎమ్మెల్యే వరకు అంతా అసంతృప్తితోనే ఉన్నారు. తమకు తెలియకుండానే లబ్ధిదారులను ఎంపిక చేస్తుండటంతో తమనెవరు పట్టించుకుంటారంటూ అనేక సందర్భాల్లో స్థానిక ప్రజాప్రతినిధులు పార్టీ పెద్దల ముందు ఆవేదన వ్యక్తం చేశారు. కార్యకర్తలకు ప్రాధాన్యమిచ్చే కార్యక్రమాన్ని ప్రభుత్వం త్వరలో ప్రారంభించబోతుందని పార్టీలోనే చర్చ జరుగుతుంటే అది ఎలా ఉండబోతుందోనని అంతా ఉత్సాహంగా ఎదురుచూశారు. తీరా చూస్తే వాలంటీర్ల వెంట వారిని పంపాలని పార్టీ నిర్ణయించడంతో నిట్టూరుస్తున్నారు. వాలంటీర్లతో ఇప్పటివరకు పని చేయించుకుంటున్న ప్రభుత్వం సరిగ్గా ఎన్నికల దగ్గరకొచ్చే సరికి తాము గుర్తు వచ్చామంటూ పార్టీపై ఆడిపోసుకుంటున్నారు. జనంతో సంబంధాలు తెగిపోయిన తర్వాత ఇంకా చేయడానికి ఏం ఉంటుందని ప్రశ్నిస్తున్నారు. పథకాల ఎంపికలో ప్రాధాన్యం లేకపోగా పైసా ఆదాయంలేని కన్వీనర్లు, గృహ సారథ్యం బాధ్యతలను అప్పగించడంపై పెదవి విరుస్తున్నారు.

కన్వీనర్లు, గృహ సారథుల నియామకాలను త్వరగా పూర్తి చేయాలని ఈ నెల 23న నిర్వహించిన వైసిపి విస్తృత స్థాయి సమావేశంలో రీజనల్ కో- ఆర్డినేటర్ బొత్స సత్యనారాయణ సూచించడం నాయకులు, కార్యకర్తలకు మింగుడు పడటంలేదు. ఆదాయం, ప్రాధాన్యం లేని ఈ బాధ్యతలను తీసుకునేందుకు ఎంత మంది ముందుకు వస్తారో అని ఎమ్మెల్యేలు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలకు సంబంధించి నగదును తమ ద్వారానే అందిస్తారా అంటూ సమావేశంలో ఒకరిద్దరు స్థానిక ప్రజాప్రతినిధులు లేవనెత్తడం ద్వారా వారు తమకు ప్రభుత్వం ఏదో ప్రాధాన్యం ఇవ్వడానికే ఈ కార్యక్రమం తీసుకొచ్చిందని తొలుత భావించారు. అవేవీ ఉండవని, ఇళ్లను సందర్శించడం, వైసిపి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు లబ్ధిదారులకు చెప్పడమేనని బొత్స చెప్పడంతో కార్యకర్తలు నిరాశకు లోనయ్యారు. ఎమ్మెల్యేలు ఇప్పుడు గడపగడపకూ మన ప్రభుత్వం చేపడుతున్న కార్యక్రమం తరహాలోనే కన్వీనర్లు, గృహ సారథులు చేయాల్సి ఉంటుందని చర్చ నడుస్తోంది. గడప గడపకూ మన ప్రభుత్వానికి వెళ్తున్న ఎమ్మెల్యేల తరహాలోనే సచివాలయం పరిధిలోని ప్రతి ఇంటినీ సందర్శించాలి. అందకనుగుణంగా వ్యయ ప్రయాసలుకోర్చి పని చేయాల్సి ఉంటుంది. ఈ పనికి ఎంత మంది ముందుకొస్తారనేది సందేహంగానే ఉంది. మరోవైపు కన్వీనర్ల నియామకం ఈ నెల 26 లోగా పూర్తి కావాలని పార్టీ ఆదేశించడంతో వారిని ఒప్పించి నియమించడం ఎమ్మెల్యేలకు ఒక సవాల్‌గానే మారింది.



నియోజకవర్గ స్థాయిలో కన్వీనర్లు, గృహ సారథుల నియామకాల పూర్తికి జిల్లాలోని ఎనిమిది నియోజకవర్గాలకు సమన్వయకర్తలను నియమించారు. ఎమ్మెల్యేలకు ముందస్తు సమాచారం లేకుండానే వైసిపి విస్తృత స్థాయిలో సమావేశంలో రీజనల్ కో-ఆర్డినేటర్ బొత్స పరిచయం చేయడం ప్రజాప్రతినిధులకు మింగుడు పడటం లేదు. అదీ వారంతా పొరుగున ఉన్న విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన వారు కావడం గమనార్హం. ఇదే జిల్లాకు చెందిన వారిని నియమిస్తే పని జరగదని భావించారో ఏమో పొరుగు జిల్లాల వారిని సమన్వయకర్తలుగా పార్టీ నియమించింది. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమానికి జిల్లాకు చెందిన పలువురు నాయకులను ఆయా నియోజకవర్గాలకు ఇన్‌ఛార్జులుగా నియమించారు. వారంతా నామమాత్రంగా మారారు. బహుశా ఈ అనుభవాలను దృష్టిలో పెట్టుకుని కాబోలు అందరినీ పక్క జిల్లాల నుంచి తీసుకొచ్చి నియమించారు. పార్టీ నియమించిన సమన్వయకర్తలకు ఎమ్మెల్యేలు ఎంతవరకు సహకరిస్తారనేది సందేహాలు పార్టీ పెద్దల్లోనూ ఉన్నట్లు కనిపిస్తోంది. వీడెందుకు వచ్చేసాడా అని విసుక్కోకుండా సమన్వయకర్తలకు ఎమ్మెల్యేలు సహకరించాలంటూ బొత్స సూచించడం ద్వారా పరిస్థితిని కొంత అంచనా వేసినట్లుగా ఉంది కన్వీనర్లు, గృహ సారథుల నియామకంలో కూడా సమస్యలు తలెత్తేలా ఉన్నాయి. జిల్లాలో ఒకట్రెండు నియోజకవర్గాల్లో మినహా మిగిలిన వాటిలో పార్టీ రెండు గ్రూపులుగా చీలింది. ఎమ్మెల్యేలంతా వారికి అనుకూలంగా ఉన్నవారికే ఆ బాధ్యతలను అప్పగిస్తారు. అప్పుడు వారంతా గృహ సారథులు అవుతారు. మరి ఎమ్మెల్యేలను తీవ్రంగా వ్యతిరేకించిన వారు ఏం చేస్తారు? వీరంతా శల్య సారథ్యం చేస్తారా అనే చర్చ పార్టీలో నడుస్తోంది. గ్రామ, వార్డు కమిటీల స్థానంలో వైసిపి తీసుకొస్తున్న కన్వీనర్లు, గృహ సారథుల వ్యవస్థ పార్టీకి మేలు చేస్తుందా లేక కీడు చేస్తుందా అని తెలియాలంటే నియమకాలు పూర్తయి, పనిలోకి దిగేవరకు వేచి చూడాల్సిందే.

ప్రజా సంక్షేమమే లక్ష్యం

స్పీకర్ సీతారాం



మహిళ నుంచి సమస్యలు అడిగి తెలుసుకుంటున్న సీతారాం

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

భవిష్యత్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని సుస్థిరంగా సుభిక్షంగా ఉంచే శక్తి ఒక్క జగన్మోహన్‌రెడ్డికి మాత్రమే ఉందని శాసనసభాపతి తమ్మినేని సీతారాం అన్నారు. శనివారం మండలంలోని చిగురువలస గ్రామంలో 74వ రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు సక్రమంగా అందుతున్నాయో లేదా అని అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు అందిన ప్రభుత్వ లబ్ధిని సచివాలయ సిబ్బందితో కలిసి వివరించారు. ఎవరికైనా అర్హత ఉండి సంక్షేమ పథకాలు అందకపోతే గ్రామ సచివాలయాలను సంప్రదించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని కోరారు. పలువురు అపరిష్కారం కాని సమస్యలను స్పీకర్ దృష్టికి తీసుకువచ్చారు. సంబంధిత అధికారులతో మాట్లాడి అక్కడికక్కడే వాటిని పరిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ముడున్నర ఏళ్లలో మండలంలోని ప్రతి గ్రామంలో జరిగిన అభివృద్ధిని ప్రజానీకం ముందు ఉంచేందుకు ఈ కార్యక్రమం దోహద పడిందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షులు బెవర మల్లేశ్వరరావు, వైస్ ఎంపిపి శివానందబాబు, పిఎసిఎస్ అధ్యక్షులు కోవిలపు చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ గొండేల సింహాచలం, నాయకులు అత్తులూరి మురళీమోహన్, రవికాంత్, రమణ, బద్రి రామారావు, తదితరులు పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న డాక్టర్ శ్రీధర్

క్రీడలతో సంపూర్ణ ఆరోగ్యం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

యువత క్రీడలు ఆడితే తద్వారా సంపూర్ణ ఆరోగ్యాన్ని పొందవచ్చునని వైద్యులు దానేటి శ్రీధర్ అన్నారు. నగరంలోని ఎన్‌టిఆర్ మున్సిపల్ మైదానంలో యూత్ బాయ్స్ ఆధర్యాన నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్‌ను శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా వివిధ జట్ల క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కాసేపు బ్యాట్, బాల్ పట్టి క్రికెట్ ఆడారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ క్రీడల ద్వారా మానసిక ప్రోత్సాహంతో పాటు ఉల్లాసాన్ని పొందవచ్చునని తెలిపారు. క్రీడలు ఆడడం వల్ల రోజంతా ఉత్సాహంగా ఉండవచ్చునని చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడలపై మక్కువ చూపాలని పిలుపునిచ్చారు. సంఘ సేవకులు సూర శ్రీనివాసరావు మాట్లాడుతూ యువతకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ ఉంటాయని స్పష్టం చేశారు. శరీర వ్యాయామానికి క్రీడలు ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. మొత్తం 36 జట్లు పాల్గొన్న ఈ క్రీడా పోటీలు వారం రోజులు పాటు జరగనున్నాయి. కార్యక్రమంలో ఉమారుద్ర కోటేశ్వరస్వామి ఆలయ ట్రస్టు బోర్డు చైర్మన్ సుంకరి కృష్ణ, నిర్వాహకులు బుజ్జి, సతీష్, దినేష్, బన్నీ, సంతోష్, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.



అభినందిస్తున్న జోహార్‌ఖాన్

సౌత్ ఇండియా స్కేటింగ్ పోటీలకు
'జ్ఞాన భారతి' విద్యార్థులు

ఇచ్ఛాపురం: ఈ నెల 27 నుంచి 29 వరకు మూడు రోజుల పాటు తమిళనాడులో తంజావూరులో నిర్వహించనున్న దక్షిణ భారత స్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఇచ్ఛాపురం నుంచి జ్ఞాన భారతీ విద్యా సంస్థలకు చెందిన నలుగురు విద్యార్థులు ఎంపికయ్యారు. పోటీలకు ఎంపికైన నలుగురు విద్యార్థులు అనిస్మా, జి.ఖేత్రా, డి.సాయి సుశాంత్, ఎన్.విష్ణువర్ధన్ విద్యా సంస్థల కార్యదర్శి జోహార్‌ఖాన్ శనివారం అభినందించారు. రైల్వేస్టేషన్ వరకు వెళ్లి వీడ్కోలు పలికారు. విద్యార్థులతో వ్యాయామ ఉపాధ్యాయులు కైలాస్ పండా వెళ్లారు. అభినందించిన వారిలో ట్రస్టీ రమణమూర్తి, ప్రిన్సిపాల్ ఐ.బి.పండా, ఎఒ ప్రేమ సర్తాజ్ ఖాన్, మేనేజర్ ప్రమోద్‌కుమార్, అధ్యాపక బృందం ఉన్నారు.



మాట్లాడుతున్న రాజేష్

క్రీడలతో మానసిక ఉల్లాసం


ఇచ్ఛాపురం : క్రీడలతో మానసిక ఉల్లాసం ఉత్సాహం వస్తుందని జనసేన నియోజికవర్గ నాయకులు లోళ్ల రాజేష్ అన్నారు. మండలంలోని లొద్దపుట్టిలో యువకులు ఆధ్వర్యాన శనివారం నిర్వహిస్తున్న ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్ ఛాంపియన్ పోటీల్లో పాల్గొని మాట్లాడారు. అనంతరం రూ.పది వేలు ప్రైజ్ మనీ కోసం ఆర్థికసాయం అందజేశారు. జిల్లా అసోసియేషన్ పర్యవేక్షణలో ఈ వాలీబాల్ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

గృహ లబ్ధిదారులు ముందుకు రావాలి

ప్రజాశక్తి- ఆమదాలవలస

వైఎస్ఆర్ జగనన్న కాలనీ లే అవుట్లలో ఇంటి స్థలం పట్టా పొందిన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలని కమిషనర్ ఎం.రవిసుధాకర్ విజ్ఞప్తి చేశారు. హౌసింగ్ డే సందర్భంగా పురపాలక సంఘ పరిధిలోని చింతాడ, తిమ్మాపురం లే అవుట్లను శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ లే అవుట్లలో ఇళ్ల నిర్మాణాలకు పూర్తిస్థాయి మౌలిక సదుపాయాలు కల్పిస్తామని పేర్కొన్నారు. నిర్మాణాలు చేపట్టే వారికి ప్రభుత్వపరంగా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలా చర్యలు చేపడుతున్నట్లు చెప్పారు. ఈ మేరకు వార్డు ఎమినిటీస్ కార్యదర్శులు లబ్ధిదారులతో మాట్లాడి లబ్ధిదారులు లే అవుట్‌ను సందర్శించేలా చేసి సందేహాలను నివృత్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ డి.సన్యాసిరావు, వైసిపి నాయకుడు ఎ.ఉమామహేశ్వరరావు, సచివాలయ ఎమినిటీస్ కార్యదర్శులు, హౌసింగ్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : జగనన్న ఇళ్ల కాలనీలో లబ్ధిదారులకు అందజేసిన స్థలాల్లో త్వరితగతిన ఇళ్లు నిర్మించాలని సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్టు, అర్బన్ హౌసింగ్ అధికారి సిహెచ్.మల్లేశ్వరరావు సూచించారు. పట్టణంలోని బెల్లుపడలో మెప్మ ఆధ్వర్యాన మహిళా సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. వచ్చిన మంచి అవకాశం లబ్ధిదారులు సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌పిలు నాగలక్ష్మి, నాగమణి, భార్గవి, సిఒ బాలరాజు పాల్గొన్నారు.



ఆమదాలవలస : తిమ్మాపురం లేఅవుట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్ రవిసుధాకర్

కోటబొమ్మాళి: మండలంలోని శ్రీజగన్నాథపురం, సరియాబొడ్డపాడు, హరిశ్చంద్రపురం పంచాయతీల్లో ఉన్న జగనన్న కాలనీలను ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ పరిశీలించారు. లబ్ధిదారుల భాగస్వామ్యంతో నిర్మిస్తున్న గృహాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించే విధంగా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడారు. కార్యక్రమంలో హౌసింగ్ ఎఇ రెడ్డి పాపినాయుడు, విద్యుత్‌శాఖ ఎఇ సురేష్, పిఆర్ ఎఇ లతశ్రీ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ కావ్య, సర్పంచ్ ప్రతినిధి నూక సత్యరాజు పాల్గొన్నారు.



కోటబొమ్మాళి : మాట్లాడుతున్న ఎంపిడిఒ ఫణీంద్రకుమార్

మైనారిటీల ఆశాజ్యోతి రామస్వామి

జిల్లా బిసి సంక్షేమాధికారి అనురాధ

శ్రీకాకుళం అర్బన్ : దేశంలో బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీల అభ్యున్నతి కోసం అహర్నిశలు కృషి చేసిన మహోన్నతమైన వ్యక్తి పెరియార్ రామస్వామినాయకర్ అని జిల్లా బిసి సంక్షేమాధికారిణి ఎస్.అనురాధ అన్నారు. కొంక్యాన గోవిందరాజులు ఛారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యాన నగరంలోని జ్యోతీరావుపూలే పార్కులో ఏర్పాటు చేసిన రామస్వామి నాయకర్ విగ్రహం వద్ద 49వ వర్ధంతి కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. తొలుత జ్యోతీరావు పూలే, రామస్వామి విగ్రహాలకు పూలమాలలు వేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశంలో దక్షిణాది రాష్ట్రాల ప్రజల హక్కులకు, అట్టడుగు వర్గాల అభివృద్ధికి నిరంతరం శ్రమించిన నేత పెరియార్ అన్నారు. ఎపిడబ్ల్యుజెఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంక్యాన వేణుగోపాల్ మాట్లాడుతూ దేశ జనాభాలో 85 శాతం బిసి, ఎస్‌సి, ఎస్‌టి మైనార్టీలే ఉన్నారని, వీరందరి హక్కుల కోసం పోరాడిన తొలితరం నాయకుల్లో రామస్వామినాయకర్ ఉంటారని పేర్కొన్నారు. అటువంటి మహనీయుడి విగ్రహాన్ని తన తండ్రి ట్రస్టు తరపున ఏర్పాటు చేసేందుకు అవకాశం లభించడం ఆనందంగా ఉందన్నారు. బిసి సంఘ జిల్లా అధ్యక్షుడు పిట్టా చంద్రపతిరావు మాట్లాడుతూ దేశ ప్రజలందరికీ హక్కులు కల్పించి చట్టాల రూపంలో అవకాశాలు ఇచ్చిన అంబేద్కర్ తర్వాత అంతగా పోరాడిన మహానేత రామస్వామి నాయకర్ అని పేర్కొన్నారు. అనంతరం చంద్రపతిరావుకు దుశ్శాలువ కప్పి సన్మానించారు. కార్యక్రమంలో బిసి సంఘ న్యాయ సలహాదారు వాన కృష్ణచంద్, బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ సంఘాల నేతలు గుత్తు చిన్నారావు, అలపాన త్రినాథ్‌రెడ్డి, కంఠ వేణు, యజ్జల గురుమూర్తి, జంజులూరి రామారావు పాల్గొన్నారు.



విగ్రహానికి పూలమాలలు వేస్తున్న అనురాధ

దరఖాస్తులకు ఆహ్వానం

ఆమదాలవలస : ఐసిడిఎస్ పరిధిలోని అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్ల పోస్టులకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు మహిళ శిశు సంక్షేమ అభివృద్ధి అధికారి కె.బాలమణి ఒక ప్రకటనలో తెలిపారు. అంగన్వాడీ కార్యకర్త పోస్టు ఆమదాలవలస మున్సిపాలిటీ కృష్ణాపురం (ఎస్‌టి), లక్ష్మీనగర్ వీధి హెల్పర్ పోస్ట్ (ఎస్‌సి), మండలంలోని వెదుళ్లవలస అంగన్వాడి కార్యకర్త పోస్టు (ఎస్‌సి), వంజంగి-1 హెల్పర్ పోస్టు (ఎస్‌సి), అలాగే సరుబుజ్జిలి మండలంలోని పురుషోత్తపురం-2 హెల్పర్ పోస్ట్ (ఎస్‌సి), ఇసకలపాలెం హెల్పర్ పోస్ట్ (బిసి-ఎ), సింధువాడ అంగన్వాడీ కార్యకర్త పోస్టు (ఒసి), సరుబుజ్జిలి అంగన్వాడీ కార్యకర్త పోస్టు (బిసి-ఇ), ఎల్.ఎన్.పేట మండలంలోని శ్యామలాపురం అంగన్వాడీ హెల్పర్ పోస్ట్ (ఒసి)లకు కేటాయించామని తెలిపారు. ఈ పోస్టులకు స్థానిక స్థిర నివాసం, వివాహిత మహిళా అభ్యర్థుల నుంచి నిర్ణీత దరఖాస్తు ఫారంలో ఈ నెల 23 నుంచి 31 సాయంత్రం ఐదు గంటల లోపు ఐసిడిఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తు ఫారాలను సమర్పించా లన్నారు. గడువు తేదీ తర్వాత వచ్చిన దరఖాస్తులు స్వీకరించమని తెలిఆరు. దరఖాస్తులను పరిశీలించి అర్హులైన అభ్యర్థులకు ఇంటర్వ్యూ తేదీ, స్థలం తెలియజేస్తామని చెప్పారు. ఏమైనా సందేహాలు ఉంటే కార్యాలయ పనివేళలో సంప్రదించాలని తెలిపారు.

ఇచ్ఛాపురం : ఇచ్ఛాపురం మండలం మున్సిపాలిటీ పరిధిలో ఖాళీలుగా ఉన్న అంగన్వాడీ కార్యకర్తల నియామకాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని అర్బన్ ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి నాగరాణి ఒక ప్రకటనలో తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో మూడో వార్డు అమీన్ సాహెబ్‌పేట, 23 వార్డులో ఒసి రిజర్వేషన్‌లో రెండు పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. ఆసక్తి కలిగిన మహిళలు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అలాగే మండలంలోని పూర్ణాటకంలో బిసిబి, అరకభద్రలో ఎస్‌టి, ముచ్చింద్రలో ఒసి కేటగిరీ కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని అన్నారు. ఈ నెల 31 లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

వైసిపి మండల యువజన
అధ్యక్షుడిగా శ్రీనివాసరావు



శ్రీనివాసరావు

బూర్జ : వైసిపి మండల యువజన అధ్యక్షుడిగా మామిడి శ్రీనివాసరావు నియమితులయ్యారని మండల అధ్యక్షులు కె.గోవిందరావు శనివారం తెలిపారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో పార్టీకి అనేక సేవలు అందించాలని గుర్తించుకొని శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం ఈ పదవి బాధ్యతలను ఆయనకు అప్పగించారని అన్నారు. శ్రీశీనివాసరావు మాట్లాడుతూ నాకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నిర్వహించి పార్టీని మరింత ముందుకు తెచ్చే కృషి చేస్తానని అన్నారు. వైసిపి నాయకులు అందరికీ కలిసికట్టుగా పనిచేస్తారన్నారు. సీతారాంకు, నానికి రుణపడి ఉంటానన్నారు.

మాజీ సర్పంచ్‌కు మాతృవియోగం



గంగమ్మ (ఫైల్)

పలాస : మండలంలోని బొడ్డపాడుకు చెందిన మాజీ సర్పంచ్ బొడ్డు సుధాకర్ తల్లి బొడ్డు గంగమ్మ (91) శనివారం మృతి చెందారు. ఆమెకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఆమె మృతికి తెలుగు యువత మండల అధ్యక్షుడు కిక్కర ఢిల్లీరావు, బొడ్డపాడు సర్పంచ్ తామడ మదన్, మాజీ సర్పంచ్ తామడ త్రిలోచనరావు, దాసరి శ్రీరాములు, మురుపింటి కుమార్రాజ్, బొడ్డు దుష్యంత్, సార జోగారావు, రెయ్య పాపారావు, బుడత బాలరాజు తదితరులు ఉన్నారు.

జెడ్‌పిటిసి పరామర్శ

నౌపడ: సంతబొమ్మాళి మండలంలో ఇటీవల మృతి చెందిన పలు కుటుంబాలను జెడ్‌పిటిసి పాల వసంత రెడ్డి శనివారం పరామర్శించారు. మేఘవరంలో వైసిపి కార్యకర్త ఏదూరు కాంతారావు, హనుమంత నాయుడు పేట పంచాయతీలో పెద్ద కేశినాయుడుపేటకు చెందిన మరదలాయి షణ్ముఖరావు, గజిని నీలయ్య వారి కుటుంబాలకు పరామర్శించారు. కుటుంబ సభ్యులకు సానుభూతి తెలియజేశారు. వైస్ ఎంపిపి ప్రతినిధి నక్క భీమారావు, హెచ్‌ఎన్‌పేట సర్పంచ్ ప్రతినిధి మహేష్ ఉన్నారు.



పరామర్శిస్తున్న జెడ్‌పిటిసి వసంతరెడ్డి

గుర్తు తెలియని వ్యక్తి మృతి



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

కోటబొమ్మాళి: మండలంలోని గట్లపాడు జాతీయ రహదారి బస్‌స్టాండ్ వద్ద 20 ఏళ్ల వయసు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి మూర్ఛ (పిట్స్) వచ్చి పడిపోయాడని, స్థానికుల సమాచారం మేరకు అతనని చికిత్స నిమిత్తం శుక్రవారం జిల్లా సర్వజనాస్పత్రికి తరలించామని ఎస్ఐ షేక్‌ఖాదర్‌భాష శనివారం తెలిపారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం విశాఖపట్నం కెజిహెచ్‌కు తరలించామని, అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడని తెలిపారు. ఈ ఫొటోలో ఉన్న మృతుడిని గుర్తించిన వారు స్థానిక పోలీస్‌స్టేషన్ 08942238633, ఎస్ఐ 6309990861, టెక్కలి సిఐ 6309990817 ఫోన్ నంబర్లను సంప్రదించాలని కోరారు.



ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ లక్ష్మి

పొందూరు సర్పంచ్ ఇంటిపై రాళ్ల దాడి

ప్రజాశక్తి- పొందూరు

పొందూరు మేజర్ పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి ఇంటిపై శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు రాళ్లతో దాడి చేసినట్లు భర్తతో కలిసి శనివారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదులో వివరాల మేరకు... రాత్రి 11 గంటల సమయంలో కొంత మంది దుండగులు రాళ్లతో దాడి చేసి కిటికీ అద్దాలను పగులు కొట్టడంతోపాటు, తలుపులు దబదబ బాదారు. పెద్ద శబ్దాలు రావడంతో నేను, నాభర్త, కుమారుడు భయంతో ప్రాణ రక్షణకు ఇంట్లోనే ఉండిపోయి పోలీసులకు సమాచారం అందించాం. పోలీసులు వచ్చిన తర్వాత ఇంటి ఆవరణలో పరిశీలించి ఇంటి వద్ద కాపలాగా పెట్టారు. పంచాయతీలో నేను చేస్తున్న పనుల్లో కొంత మంది అడ్డు తగులుతున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. మాకు ఇతర పార్టీల వ్యక్తులతో విబేధాలు లేవు. కొంత మంది వ్యక్తుల నుంచి నాకు, నాకుటుంబానికి ప్రాణహాని ఉంది. తమ కుటుంబానికి రక్షణ కల్పించి దాడి చేసిన వారిపై తగు చర్యలు తీసుకోవాలని కోరారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

పొందూరు మేజరు పంచాయతీ సర్పంచ్ రేగిడి లక్ష్మి ఇంటిపై రాళ్లతో దాడిచేసిన వారిని గుర్తించి కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని వైసిపి యువజన విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ పోలీసులను కోరారు. మండల కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. దాడికి పాల్పడిన వారు ఏ పార్టీకి చెందినవారైన, ఎంతటివారైనా వదిలి పెట్టేదిలేదని హెచ్చరించారు. సమావేశంలో జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షుడు పప్పల రమేష్‌కుమార్, కొంచాడ రమణమూర్తి, బాడాన సునీల్‌కుమార్, నాగేశ్వరరావు, మోహనరావు, శంకరరావు పాల్గొన్నారు.

పాఠశాల వంట గది ధ్వంసం



ధ్వంసమైన సామగ్రి

వజ్రపుకొత్తూరు : ఉద్దానంలో ఎలుగుబంటి సంచారంతో స్థానికులు భయాందోళన చెందుతున్నారు. మండలంలోని డోకులపాడు పాఠశాల వంటగది లోకి శనివారం వేకువ జామున ఎలుగు చొరబడి వంట సామగ్రిని ధ్వంసం చేసింది. పరిసరాల్లో తిరుగుతూ బీభత్సం సృష్టించింది. అంతకుముందు గ్రామంలో సంచరిస్తూ భయాందోళనకు గురి చేసిందని గ్రామస్తులు తెలిపారు. పాఠశాలకు ప్రహరీ నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడంతో ఎలుగు బంట్లు, పశువులు, కుక్కలు సంచరిస్తున్నాయని విద్యార్థుల తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ప్రహరీ నిర్మాణం పూర్తి చేయాలని స్థానికులు కోరుతున్నారు.



రైతుతో మాట్లాడుతున్న జెడి శ్రీధర్

రబీ పంటలకు 'ఈ-క్రాప్'

కోటబొమ్మాళి: రబీ సీజన్‌లో సాగుచేస్తున్న పెసలు, మినప, ఉలవలు, వేరుశనగ, నువ్వు తదితర పంటలను వ్యవసాయ అధికారులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేయాలని జిల్లా జాయింట్ డైరెక్టర్ కెశ్రీధర్ అన్నారు. మండలంలోని కొత్తపేట రైతు భరోసా కేంద్రాన్ని శనివారం సందర్శించారు. ఈ మేరకు వ్యవసాయశాఖ అధికారులు పనితీరు, రికార్డుల నమోదు తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం మండలంలో పలు గ్రామాల్లో సాగు చేస్తున్న పెసలు, మినప, ఉలవలు, వేరుశనగ, నువ్వు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు, జెడిఎ క్వాలిటి కంట్రోల్ అధికారి మురళీధర్ తదితరులు పాల్గొన్నారు

బోటు వేలం

ప్రజాశక్తి- కవిటి

నాటు సారా అక్రమ రవాణాలో పట్టుబడిన ఫైబర్ బోటును మండలంలోని కొత్తపాలెం సముద్రతీరం ఒడ్డున శనివారం వేలం వేసినట్టు ఎస్ఇబి జాయింట్ డైరెక్టర్ మణికంఠ ఛందోల్ తెలిపారు. బోటుకు ప్రభుత్వం నిర్ణయించిన ధర రూ.18 వేలుగా కాగా, వేలం పాటలో ఇద్దివానిపాలెంకు చెందిన జి.హనుమంతు రూ.58 వేలకు పాట పాడి సొంతం చేసుకున్నట్టు తెలిపారు. ఈ వేలం పాటలో ఎస్ఇబి అసిస్టెంట్ కమిషనర్ కె.పి.గోపాల్, ఎస్ఇబి ఎస్ఐలు గురుమూర్తి, ముసలినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.



బోటును వేలం వేస్తున్న ఎస్ఇబి సిబ్బంది

చదువుపై శ్రద్ధ అవసరం



మాట్లాడుతున్న హనుమంతురావు, హాజరైన విద్యార్థులు, తల్లిదండ్రులు

నరసన్నపేట: తమ పిల్లలు చదువులపై తల్లిదండ్రులు అవగాహన ఉండాలని నారాయణ జూనియర్ కళాశాల డిజిఎం హనుమంతురావు సూచించారు. నరసన్నపేట సత్య కళ్యాణ మండపంలో నారాయణ పాఠశాల విద్యార్థులకు, తల్లిదండ్రులకు శనివారం అవగాహన కల్పించారు. పిల్లలు పదో తరగతి పూర్తి చేసిన తర్వాత ఏ గ్రూప్‌లో చేరితే మంచిది, ఏ గ్రూప్ చదివితే భవిష్యత్‌లో విద్యార్థి ఏ విధంగా ఉద్యోగం సాధించి స్థిరపడతారు అనే అంశంపై అవగాహన కల్పించారు. ఆదేవిధంగా ఐఐటి, జెఇఇ మెయిన్, జెఇఇ అడ్వాన్స్ ర్యాంకు రావాలంటే ఏవిధంగా చదవాలి, నీట్ పరీక్షలో ఎంబిబిఎస్ సీట్లు సాధించాలంటే విద్యార్థులు ఎలా చదవాలి అనే అంశంపై అవగాహన కల్పించారు. వీటిని ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎజిఎం ఐ.రమేష్, ప్రిన్సిపాల్. ఎ.రమేష్, ఎఒ రామకృష్ణ, సిబ్బంది పాల్గొన్నారు.

గోకర్ణపల్లిలో తాగునీటి బోరు ఏర్పాటు

పొందూరు: మండలంలోని గోకర్ణపల్లిలో అసిరి తల్లి అమ్మవారి వనం వద్ద జిల్లా పరిషత్ నిధులు రూ.1.20 లక్షలతో తాగునీటి బోర్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ ప్రతినిధి చింతాడ సత్యప్రసాద్ శనివారం తెలిపారు. తాగునీటి బోర్ మంజూరు చేసిన శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాంకు సర్పంచ్‌తో పాటు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి గోవిందరావు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పనులను పరిశీలిస్తున్న సత్యప్రసాద్



ప్రశంసాపత్రాలు అందుకున్న విద్యార్థులు

సిక్కోలు విద్యార్థుల సత్తా

ప్రజాశక్తి- పలాస

జాతీయ వినియోగదారుల దినోత్సవాన్ని పురస్కరించుకొని వినియోగదారుల కమిషన్లలో కేసులను సమర్థవంతంగా పరిష్కరించడం అనే అంశంపై నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో మండలంలోని బ్రాహ్మణతర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎర్ర మౌనిక వ్యాసరచన పోటీలో ద్వితీయ స్థానం సాధించింది. రూ. ఐదు వేలు నగదు బహుమతి గెలుపొందింది. అలాగే వజ్రపుకొత్తూరు మండలం నగరంపల్లి హైస్కూల్ విద్యార్థిని బి.హారిక ఆంగ్ల మాధ్యమం వక్తృత్వంలో ప్రథమ స్థానం సాధించి రూ.ఏడు వేల నగదు బహుమతిని సాధించారు. వీరికి రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి కారుమూరి, వెంకట నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ సామినేని ఉదయ భాను, పౌర సరఫరాలశాఖ ఉన్నత అధికారులు విజయ సునీత, సునీల్ చౌదరి నుంచి విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో అందుకున్నారు. జిల్లాస్థాయిలో ఇదే అంశంపై నిర్వహించిన పోటీల్లో వై.మౌనిక, ఎస్.రేష్మ, ఎ. హ్యాపీ, బి.హారికలు వ్యాసరచన, వక్తృత్వం పోటీలో జిల్లా ప్రథమ స్థానం సాధించి ఒక్కొక్కరు రూ.3 వేలు నగదు బహుమతికి ఎంపికయ్యారు. విజయవాడలో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొన్నారు. ఈ విద్యార్థులకు మార్గదర్శి ఉపాధ్యాయులుగా కొయ్యలు శ్రీనివాసరావు, దువ్వాడ జనార్ధనరావు, ఉప్పాడ రమేష్, కణితి సూర్యనారాయణలు వ్యవహరించారు. రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య ఉపాధ్యక్షులు ఎల్.వెంకటాచలం పాల్గొన్నారు. వీరిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె.వైకుంఠరావు, టి.అప్పలస్వామి, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.



మాట్లాడుతున్న ప్రసాద్‌రాజు

విద్యార్థులు ఔత్సాహిక వేత్తలుగా ఎదగాలి

ప్రజాశక్తి- టెక్కలి రూలర్

ఐతమ్ విద్యార్థులు పెద్ద సంఖ్యలో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని ఒఎన్‌టియు కాకినాడ ఉపకులపతి ప్రొఫెషర్ జి.వి.ఆర్.ప్రసాదరాజు పిలుపునిచ్చారు. టెక్కలి ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కళాశాలలో డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు అధ్యక్షతన శనివారం 'న్యూర్ షిప్ అండ్ ఇన్నా వేషన్' సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ విద్యార్థినీ, విద్యార్థులు చదువుతోపాటు పరిశ్రమల స్థాపనకు అవసరమైన భానాన్ని, అవగాహనను పెంచుకోవాలన్నారు. ఉద్యోగానికి పరిమితం కాకుండా వందలాది మందికి ఉద్యోగాలు కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. పరిశ్రమల స్థాపన, పెట్టుబడి, ఉత్పత్తి, వాణిజ్య రంగాలపై అధ్యయనం చేసి పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. జిల్లా పరిశ్రమల శాఖ అసిస్టెంట్ డైర్వేర్ ఆర్.వి.రమణారావు జిల్లాల పరిశ్రమల స్థాపనకు కావాల్సిన, అనువైన పరిస్థితులు, కేంద్ర రాష్ట్ర అభుత్యాలు ఎస్‌సి, ఎస్‌ఎ, బిసి తరగతులతో పాటు మహిళలకు అందిస్తున్న ప్రోత్సాహకాలను వివరించారు. కార్యక్రమంలో కార్యదర్శి ఎల్.ఎల్.నాయడు, కోశాధికారి టంకాల నాగరాజు, ఐతమ్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ ఎస్.శ్రీనివాసరావు, డైరెక్టర్ డాక్టర్ కె.బి.మధుసాయ్ను, డి. విష్ణుమూర్తి, డాక్టర్ బి.రాజేష్, డాక్టర్ బి.సతీష్, డాక్టర్ బి.శివకుమార్, పలు విభాగాల సమన్వయకర్తలు, డీన్లు, హెచ్ఒలు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు

నరసన్నపేట : నరసన్నపేటలోని పెద్దపేట వీధిలో గల రవీంద్రభారతి పాఠశాలలో శనివారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ వాసుదేవరావు ఏసుక్రీస్తు జననం, క్రిస్మస్ ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో భాగంగా పిల్లలు చేసిన వివిధ రకాల సంస్కృతిక కార్యక్రమాలతో అలరించారు.

లావేరు : మండలంలోని తాళ్లవలస అంగన్‌వాడీ కేంద్రంలో క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో అందరినీ అలరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్త ఎం.వెంకటలక్ష్మి, సచివాలయ మహిళా కానిస్టేబుల్ జగదీశ్వరి, సహాయకులు పాల్గొన్నారు.

టెక్కలి : స్థానిక ఓక్లాండ్ పాఠశాల ప్రిన్సిపాల్ మల్లా మధులత ఆధ్వర్యాన క్రిస్మస్ వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా శాంతా క్లాస్, మేరీమాత రూపాల్లో విద్యార్థుల వేషదారణలు పలువురుని అలరించాయి. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రజని, పుష్పలత, రాధాకృష్ణ, రజిత, లావణ్య పాల్గొన్నారు.

స్థానిక రవీంద్ర భారతి పాఠశాలలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో ప్రిన్సిపాల్ పద్మజ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



మెళియాపుట్టి : దుస్తులను పంపిణీ చేస్తున్న శ్రీకాంత్



టెక్కలి : క్రిస్మస్ వేషధారణలో ఉన్న ఓక్లాండ్ విద్యార్థులు

చీరలు, దుప్పట్లు పంపిణీ

మెళియాపుట్టి : గిరిజను అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తుందని తూర్పు కాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్ అన్నారు. మండలంలోని భరణికోటలో శనివారం క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొని వంద మంది గిరిజనులకు చీరలు, దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల వైస్ ఎంపిపి సవర ఆదినాయుడు, సర్పంచ్‌లు రంగారావు, పెద్దింటి చంద్రావు, ఎంపిటిసి సవర రవికుమార్, పాస్టర్లు కృపానందం, శామ్యూల్, జాన్, రామయోగి, గ్రామస్తులు చిన్నవాడు, ఉగాది, బుడ్డయ్య, తవిటయ్య పాల్గొన్నారు.



బైక్‌లను ప్రారంభిస్తున్న విశ్వనాథం

బజాజ్ పల్సర్ 150 ఆవిష్కరణ

శ్రీకాకుళం అర్బన్ : నగరంలో ఎక్కువ మంది అభిమానించే అత్యంత విలువైన ద్విచక్ర, మూడు చక్రాల వాహనాల తయారీ కంపెనీ బజాజ్ ఆటో సరికొత్త పల్సర్ 150 బజాజ్ ఆదరైజ్డ్ డీలర్ సాయి గాయత్రి బజాజ్ శ్రీకాకుళంలో శనివారం ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సాయిగాయత్రి బజాజ్ షోరూం సేల్స్ మేనేజర్ ఎం.విశ్వనాథం, ఎం.జయరాం మాట్లాడుతూ ఆధునిక స్పోర్టి డిజైన్‌తో పాటు శక్తివంతమైన పునరుద్ధరించిన 150 సిసి ఇంజిన్ శక్తితో వాహణదారులకి చూడగానే ఆకట్టుకునే సవారీని అందిస్తుందన్నారు. పల్సర్ 150లో శక్తివంతమైన 149.68 సిసి ఇంజిన్ నూతన డిజైన్‌తో స్పోర్టియర్‌గా, షార్పర్‌గా ఉంటుందన్నారు. నూతన ఏరో డైనమిక్ 3డిఫ్రంట్ ఉందన్నారు. ఆధునిక ట్యాంకు, ఫోఫైల్ సీటు నూతన మోనోషాక్ రియర్సస్పెన్షన్ అండర్ బెల్లి ఎగ్జాస్ట్ అత్యుత్తమ బ్యాలన్స్, హ్యాండ్లింగ్ ఈ వాహనం ప్రత్యేకత అని చెప్పారు. ఫీచర్లతో రూపొందించిన వాహనం రెండు వెరియంట్లలో అందజేస్తున్నట్టు తెలిపారు. రెండు డిస్కుల వాహనం ధర రూ.1,19,782 (ఎక్స్ షోరూం శ్రీకాకుళం), సింగిల్ వెరియంట్ ధర రూ.1,16,881 ఉంటుందన్నారు. కార్యక్రమంలో సాయి గాయత్రి బజాజ్ డైరెక్టర్ జగదీశ్వరరావు, ఎ.ఎస్.ఎం.గోపాలకృష్ణ, షోరూం సిబ్బంది, కొనుగోలుదారులు పాల్గొన్నారు.



చట్టాలపై అవగాహన అవసరం

జూనియర్ సివిల్ జడ్జి మణి

ప్రజాశక్తి- ఆమదాలవలస

చట్టాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ బాలికోన్నత ఉన్నత పాఠశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బాలికలకు ఎన్నో చట్టాలు రక్షణగా ఉన్నాయని, విద్యార్థులు వాటిపై అవగాహన కల్పించుకుని ఉపయోగించుకోవాలని అన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు కణితి విజయలక్ష్మి బాల్య వివాహాల వల్ల కలిగే నష్టాలను విద్యార్థులకు వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రక్షణ, మహిళా చట్టాలు, హక్కులను ప్రతిఒక్కరూ క్షుణ్ణంగా తెలుసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో న్యాయవాదులు బొడ్డేపల్లి మోహనరావు, తమ్మినేని అన్నంనాయుడు, బూర్లె సీతారాం, కింతలి త్రినాథ రావు, సనపల ప్రసాదరావు, హనుమంతు అచ్చెన్నాయుడు, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు విజయలక్ష్మి పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న సంఘ సభ్యులు

లింగ వివక్షను రూపు మాపాలి

ఆమదాలవలస : సమాజంలో స్త్రీ, పురుషుల మధ్య వ్యత్యాసాన్ని వివక్షను రూపుమాపి సమతుల్య సమాజ స్థాపన లక్ష్యంగా మహిళా సంఘ సభ్యులు అవగాహన కల్పించాలని ఎపిఎం పైడి కూర్మారావు అన్నారు. 'లింగ వివక్షతకు ఇక ముగింపు' అన్న కార్యక్రమంపై పట్టణంలో శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నెల రోజులుగా అన్ని గ్రామ సంఘాల్లో లింగ వివక్షతపై మహిళలకు అవగాహన కల్పిస్తూ సమాజంలో మార్పు కోసం ఈ ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు. ప్రతి ఇంటిలో ఆడ-మగ పిల్లలిద్దరు ఉన్నారని, సమానంగా క్రమశిక్షణతో పెంచాల్సిన బాధ్యత ప్రతి తల్లితండ్రిపైనా ఉందని అన్నారు. ఇంట్లో క్రమశిక్షణ నేర్పితేనే పాఠశాల, కళాశాలల్లో పిల్లలు సత్ప్రవర్తనతో మెలుగుతారన్నారు. బాల్యంలో క్రమశిక్షణ నేర్పించలేకపోతే రేపటి సమాజంలో మన బిడ్డలు తలదించుకోవాల్సిన పరిస్థితి వస్తుందన్నారు. ఆడ పిల్లల చదువు కోసం ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు. కార్యక్రమంలో మండల మహిళా సమాఖ్య ప్రతినిధులు ధనలక్ష్మి, వేణమ్మ, రేణుక, అకౌంటెంట్ కళ్యాణి, క్లస్టర్ కో-ఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.

సజావుగా గ్రామసభలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

గ్రామసభలు క్షేత్రస్థాయిలో సజావుగా నిర్వహించాలని ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి ఉంగటి వెంకటరమణ కోరారు. ఈ మేరకు డిఎల్‌డిఒ, శ్రీకాకుళం ఎంపిడిఒ కార్యాలయాలయాల్లోని అధికారులను శనివారం కలిసి వినతిపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు జిల్లాలో గ్రామసభలు సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. క్షేత్రస్థాయి సమస్యల శాశ్వత పరిష్కారానికి, పరిపాలనలో ప్రజలను భాగస్వామ్యం చేయడానికి, దేశ అభివృద్ధికి గ్రామసభలు కీలకంగా ఉపయుక్తమవుతాయని సూచించారు. గ్రామసభల నిర్వహణపై అధికారులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించేందుకు ప్రజాస్వామ్య పరిరక్షణ ఐక్యవేదిక సంసిద్ధతను తెలియజేశారు. కార్యక్రమంలో కోశాధికారి బి.వి.రమణమూర్తి, చింతు గణపతి, శిమ్మ రాజారావు, కొంద్ర అప్పలరాజు పాల్గొన్నారు.

పాడుతా తీయగా అదుర్స్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ఆదిత్య ఈవెంట్స్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని బాపూజీ కళా మందిరంలో పాడుతా తీయగా కార్యక్రమం ఆద్యంతం ఉత్సాహభరితంగా శనివారం సాగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో గాయని గాయకులు, వివిధ కళా రంగాల్లో సేవలందజేస్తున్న కళాకారులు పాల్గొని తమ యొక్క ప్రతిభ పాటలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా వంద మంది నిరుపేద కళాకారులకు రూ.15 వందల విలువైన నిత్యవసర సరుకులను పలువురు చేతుల మీదుగా అందజేశారు. కళా ప్రదర్శనలు అద్భుతంగా ఉన్నాయని వక్తలు పేర్కొన్నారు.

ప్రస్తుత రోజుల్లో చాలామంది కళాకారుల జీవన బతుకులు దుర్భరంగా ఉన్నాయని, ఈ నేపథ్యంలో అటువంటి కళాకారులకు ఆదిత్య ఈవెంట్స్ చేయూతనివ్వడం శుభపరిణామమని వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ దానేటి శ్రీధర్, డాక్టర్ ఆర్.ప్రశాంత్, పారిశ్రామికవేత్త సూర శ్రీనివాసరావు, సంఘ సేవకులు, విద్యావేత్త డాక్టర్ బాడాన దేవభూషణ్‌రావు, జెసిఐ ప్రెసిడెంట్ హరికృష్ణ, డాక్టర్ నిక్కు అప్పన్న, సాయి, టి.రమేష్, నిర్వాహకులు కూన అనిల్‌కుమార్, బోడిగి కార్తీక్, మిమిక్రీ శివ పాల్గొన్నారు.


బహుమతిని అందజేస్తున్న నిర్వాహకులు

సంక్షేమాధికారుల సంఘం అధ్యక్షునిగా రాముడు

శ్రీకాకుళం అర్బన్ : సాంఘిక సంక్షేమశాఖ డిడి కార్యాలయంలో శనివారం సాంఘిక సంక్షేమ హాస్టల్ సంక్షేమధికారుల సంఘ ఎన్నికలు నిర్వహించారు. ఎన్‌జిఒ అసోసియేషన్ నాయకులు డి.శశిభూషణరావు, బడగల పూర్ణచంద్రరావు ఎన్నికల అధికారులుగా, జిల్లా అధ్యక్షులు హనుమంతు సాయిరాం పరిశీలకునిగా వ్యవహరించారు. సంక్షేమధికారుల సంఘ అధ్యక్షునిగా డి.రాముడు, కార్యదర్శిగా తారక్, కోశాధికారిగా కె.సురేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. వీరితో పాటు సహాధ్యక్షునిగా ఎస్.కె.భాషా, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా మల్లేశ్వరరావు, ఉపాధ్యక్షులుగా సత్యనారాయణ, చిన్నమ్మి, మోహనరావు, సంయుక్త కార్యదర్శులుగా నర్సింగరావు, సుజాత, సీతారాం, ఇసి మెంబర్లుగా జోగినాయుడు, సరిత, రమేష్, స్వర్ణలత ఎన్నికయ్యారు.


మాట్లాడుతున్న సాయిరాం

ఈ సందర్భంగా సాయిరాం మాట్లాడుతూ ఉద్యోగులంతా ఐక్యతతో ఉంటేనే సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఉద్యోగులకు ఎన్‌జిఒ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ అధ్యక్షులు కొంఖ్యాన వేణుగోపాల్, సంక్షేమధికారుల సంఘ గౌరవ అధ్యక్షుడు ప్రహ్లాద, గౌరవ సలహాదారు డి.వి.ప్రసాద్ పాల్గొన్నారు.

జనవరిలో మూడో విడత 'ఆసరా'


మాట్లాడతున్న కూర్మారావు

ఎపిఎం కూర్మారావు

ఆమదాలవలస : ప్రభుత్వం మహిళా సంఘాలకు ఇచ్చిన హామీ ప్రకారం రుణమాఫీ కింద వైఎస్ఆర్ ఆసరా పథకం ద్వారా మూడో విడత నిధులు జనవరి నెలలో జమ ప్రభుత్వం జమ చేస్తుందని వైఎస్ఆర్ క్రాంతి పథం అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. పట్టణంలోని మహిళా సమాఖ్య కార్యాలయంలో శనివారం మాట్లాడారు. వంద శాతం సంఘాల మహిళల బయోమెట్రిక్ తీసుకొని సంబంధిత లిస్టులను సోషల్ ఆడిట్ ప్రజల ప్రయోజనార్థం కోసం అన్ని గ్రామ సచివాలయాల్లోని నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు పేర్కొన్నారు. స్వయం సహాయక సంఘాల సభ్యులందరూ పరిశీలించాలన్నారు. అర్హులై ఎవరైనా తప్పిపోతే గ్రీవెన్స్ పెట్టుకోవచ్చని సూచించారు. గ్రామ పంచాయతీలకు సంబంధించిన సమాచారాన్ని 19 సచివాలయాల నోటీసు బోర్డులో పొందుపరిచినట్లు చెప్పారు. కార్యక్రమంలో వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు, క్లస్టర్ కోఆర్డినేటర్లు, విఒఎలు పాల్గొన్నారు.

దళత మహాసభ మండల కార్యవర్గం ఎన్నిక

కొత్తూరు : స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో శనివారం దళిత మహాసభ మండల నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షులుగా డి.జమ్మయ్య, బి.గుమ్మయ్య, వడమ శ్రీనివాసరావు, బొడ్డేపల్లి కృష్ణారావు, అధ్యక్షులుగా తొంపల తిరుపతిరావు, ప్రధాన కార్యదర్శిగా తొంపల వెంకటరావు, కార్యదర్శిగా బొడ్డేపల్లి రామకృష్ణ, కన్వీనర్‌గా పడల నాగభూషణరావు, ఉపాధ్యక్షులుగా జగజ్జీవన్‌రావు, చుక్కా రాంబాబు, పసుపురెడ్డి వెంకట్రరావు, మరేళ్ల రాజారావు, సహాయ కార్యదర్శులుగా గుడివాడ రామారావు, ధూళి రామారావు, చల్లా గోవిందరావు, పుచ్చ అప్పారావు, రిసి శ్రీనివాసరావు, సిరిపురం లక్ష్మణరావులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.


ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

నేడు సీతారాములునాయుడు విగ్రహావిష్కరణ

పోలాకి : పోలాకిలో కీర్తిశేషులు డోల సీతారాములు నాయుడు విగ్రహావిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ మజ్జి రమణమ్మ, ప్రతినిధి లక్ష్మీనారాయణ, కమిటీ సభ్యులు ఈసర్ల శ్రీధర్‌బాబు (చిన్ని) తెలిపారు. పోలాకిలో శనివారం విలేకరులతో మాట్లాడారు. నిస్వార్థ రాజకీయ నాయకులు, మాజీ శాసనసభ్యులు, అందరికీ రాజకీయ గురువుగా పేరొందిన నాయకులు సీతారాములు నాయుడు అని అన్నారు. ఆయన ఈ ప్రాంత ప్రజలకు చేసే సేవలు ఇప్పటికీ మరువలేనివన్నారు. ఆయన విగ్రహానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు, ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్‌లు ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. ముఖ్య అతిథిలుగా విద్యాశాఖ, ఇన్‌ఛార్జి మంత్రి బొత్స సత్యనారాయణ, శాసనసభ స్పీకర్ తమ్మినేని సీతారాం హాజరు అవుతారని చెప్పారు. ప్రజలు, అభిమానులు, ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.


రికార్డులను పరిశీలిస్తున్న జడ్జి రవిశంకర్

బాల సదనం తనిఖీ

పలాస: కాశీబుగ్గ బాల సదనాన్ని పలాస జూనియర్ సివిల్ జడ్జి పి.రవిశంకర్ శనివారం ఆకస్మికంగా పరిశీలించారు. విద్యార్థులు సాయంత్రం వేళ అల్పాహారం తీసుకుంటున్న సమయంలో అక్కడకు చేరుకుని వసతి, భోజన సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం రికార్డులను పరిశీలించారు. వంట గదిని తనిఖీ చేసి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థుల ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని, పోషకాలతో భోజనంలో నాణ్యత పాటించాలని సూచించారు. తమకు సిబ్బంది కొరత ఉందని, రేషన్‌కు బకాయి ఉన్నట్లు జడ్జి దృష్టికి వార్డెన్ తీసుకొచ్చారు. ఈయనతో పాటు న్యాయవాదులు కొమర దేవరాజు, అనీల్‌రాజ్, బి.వి.ఆర్.పట్నాయక్, కోర్టు సిబ్బంది ఉన్నారు.

పార్టీ అభివృద్ధికి కృషి

టెక్కలి : జనసేన పార్టీ టెక్కలి నియోజకవర్గ ఐటి విభాగం కో-ఆర్డినేటర్‌గా టెక్కలికి చెందిన రాయి సునీల్ శనివారం నియమితులయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి సామాజిక మాధ్యమాల ద్వారా ప్రచారానికి తనవంతు కృషి చేస్తానని తెలిపారు. సునీల్ నియామకంపై ఎస్‌సి సెల్ విభాగం నిర్వాహకులు కూరాకుల యాదవ్ అభినందించారు.



ధర్నా చేస్తున్న కార్మికులు

రాజ్యలక్ష్మి పోల్స్ కార్మికుల ధర్నా

ప్రజాశక్తి- పొందూరు

కార్మికుల హక్కులను హరిస్తూ, దుర్మార్గంగా వ్యవహరిస్తూ కార్మికులపై వేధింపులకు పాల్పడుతున్న వావిలపల్లిపేట వద్ద ఉన్న రాజ్యలక్ష్మి పోల్స్ యాజమాన్యంపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఐఎఫ్‌టియు రాష్ట్ర కమిటీ సభ్యులు డి.గణేష్ డిమాండ్ చేశారు. కంపెనీ వద్ద కార్మికులతో కలిసి శనివారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కంపెనీలో కార్మికచట్టాలేవీ అమలు కావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే డిప్యూటీ లేబర్ కమిషనర్ జోక్యం చేసుకుని కార్మికులపై దుశ్చర్యలకు ప్పాడుతున్న యాజమాన్యంపై చర్యలు తీసుకుని కార్మిక చట్టాలు అమలు అయ్యేలా చర్యలు తీసుకుని కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు లక్ష్మణరావు, కంపెనీ కార్మిక యూనియన్ నాయకులు ఎల్.రాజారావు, పి.జగత్ పాల్గొన్నారు.


సన్మానిస్తున్న మండల నాయకులు

'ధర్మాన'ను కలిసిన నాయకులు

కోటబొమ్మాళి: సంతబొమ్మాళి మండలం మూలపేటలో పోర్టు భూ నిర్వాసితులకు మొదటి విడత చెక్కులు పంపిణీ కార్యక్రమానికి రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు వెళున్నారు. విషయం తెలుసుకున్న వైసిపి నాయకులు కొత్తపేట కూడలిలో మండల పరిషత్ అధ్యక్షుడు రోణంకి ఉమామల్లేశ్వరరావు, జెడ్‌పిటిసి దుబ్బ వెంకటరావు, అన్నెపు రామారావు శనివారం మర్యాదపూర్వకంగా కలిసి మంత్రికి దుశ్శాలువ కప్పి సన్మానించారు. అనంతరం మండలంలోని పలు సమస్యలను వివరించారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు హేమసుందరరాజు, సీనియర్ నాయకులు పేడాడ వెంకటరావు, అంగ గున్నయ్య, సింగుపురం వినోద్, హనుమంతు గోవిందరావు, పంకు రాములు పాల్గొన్నారు.


పారంభిస్తున్న ఎమ్మెల్యే కిరణ్ కుమార్

రిలయన్స్ స్మార్ట్ పాయింట్ ప్రారంభం

ప్రజాశక్తి- రణస్థలం

మండలం కేంద్రం 16వ నంబరు జాతీయ రహదారికి అనుకుని ఉన్న రిలయన్స్ స్మార్ట్ పాయింట్‌ని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ శనివారం ప్రారంఇంచారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రణస్థలం ప్రాంతానికి ఇటువంటి సంస్థలు వచ్చి వ్యాపారం సాగించడం అభినందనీయమన్నారు. అలాగే ఈ ప్రాంత వినియోగదారులకు నాణ్యమైన సరుకులు తక్కువ ధరకు అందించడంతో పాటు యువతీ యువకులకు ఉపాధి దొరుకుతుందన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి మాజీ సభ్యులు గొర్లె రాజగోపాల్, రిలయన్స్ స్మార్ట్ పాయింట్ ప్రతినిధులు అనిల్, గణపతి, నరేష్, రమేష్, ముని పాల్గొన్నారు.


మాట్లాడుతున్న నీలకంఠం

సంఘం బలోపేతానికి కృషి

సోంపేట: అగ్నికుల క్షత్రియ సంఘం బలోపేతానికి కృషి చేస్తానని ఆ సంఘం రాష్ట్ర డైరెక్టర్ నీలకంఠం, జిల్లా అధ్యక్షుడు వసంతరావు అన్నారు. పట్టణంలో మండల అగ్నికుల క్షత్రియ సంఘ సమావేశం శనివారం నిర్వహించారు. సంఘం ఆధ్వర్యాన వన మహోత్సవం, నూతన కార్యవర్గం ఎన్నికపై తీర్మానం చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపిపి జి.శ్రీను, మండల అధ్యక్షుడు లింగరాజు, నాయకులు పాతని శేషగిరి, రాంరెడ్డి గణపతి, ఎం.శంకరరావు, టి.చంద్రశేఖర్, పి.శ్రీరాములు, డి.లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

ధరావతులపై స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి- లావేరు

మండలంలోని మురపాక శాఖాగ్రంథాలయంలో శనివారం ధరావతులు చెల్లింపుపై స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. గ్రంథాలయంలో విద్యార్థులతో ధరావత్తులు కట్టించడంపై ప్రతిజ్ఞ చేయించి, వారి ఇళ్లకి వెళ్లి రూ.30 వేలును ధరావత్తులను సేకరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రతి ఆదివారమూ చదవడం మాకిష్టం కార్యక్రమం గ్రంథాలయంలో నిర్వహిస్తున్నామని, మీ ఇంటిలో చదివే విద్యార్థులను పంపించి వారిచేత డిపాజిట్ చేయించి బాల సాహిత్యం పుస్తకాలను ఇళ్లకు తీసుకుని వెళ్లాలని కోరారు. అందుకు వారు సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు జి.షణ్ముఖరావు, విద్యార్థులు పాల్గొన్నారు.


విద్యార్థులతో ప్రతిజ్ఞ చేస్తున్న శ్రీనివాసరావు

జాతి మనుగడకు జీవనాడి మాతృభాష

ఆమదాలవలస : కవిత మాతృభాషపై పట్టు సాధిస్తే ఏ రంగంలోనైనా రాణించవచ్చునని, కంప్యూటర్ ప్రాధాన్యత కలిగిన ఈ యుగంలోనూ మిగతా విషయాలు అవగాహన కావాలంటే తెలుగులో ప్రావీణ్యత అవసరమని కవి కుప్పిలి వెంకట రాజారావు అన్నారు. ప్రపంచ తెలుగు రచయితల మహాసభలు నిర్వహిస్తున్న నేపథ్యంలో శనివారం విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రానికి చెందిన ఎందరో సాహితీ వేత్తలు అనేక ప్రక్రియల్లో రచనలు చేసి భావి తరాలకు సృజనాత్మక వైఖరిని అందించారన్నారు. తెలుగులో పట్టుసాధించడం వల్లే అంతర్జాతీయ స్థాయిలో అనేక బహుమతులు, అవార్డులు సాధించి, తానా సమ్మేళనాల్లో గుర్తింపు పొందని పేర్కొన్నారు. ప్రస్తుత తరం విద్యార్థులు భాష విషయంలో శ్రద్ధ పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.


వెంకట రాజారావు

విద్యార్థులకు ట్యాబ్‌ల పంపిణీ

పొందూరు: పొందూరు ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 8వ తరగతి విద్యార్థులకు ప్రభుత్వం అందజేసిన ట్యాబ్‌లను శనివారం వైసిపి రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అందజేశారు. విద్యార్థులకు సాంకేతికతతో కూడిన విద్య అవసరమన్నారు. కార్యక్రమంలో ఎంఇఒ పి.వి.రామరాజు, జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, వైసిపి మండల అధ్యక్షులు పి.రమేష్ కుమార్, కె.నాగేశ్వరరావు, పిఎంసి చైర్మన్ రాధ, నాయకులు కె.రమణమూర్తి, నాగరాజు, సునీల్ పాల్గొన్నారు.


ట్యాబ్‌లను అందజేస్తున్న నాని

అర్హులందరికీ 'ఉపాధి'

సోంపేట: పలాసపురం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ కూలీలకు పనులు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ తడక జోగారావు తెలిపారు. సచివాలయ పరిధిలో ఉపాధి హామీ పనుల గుర్తింపుపై శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయతీ పరిధిలో కొత్త పనులు గుర్తించి అందరికీ పనులు కల్పించేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో జెడ్‌పిటిసి తడక యశోద, ఎంపిడిఒ బి.వెంకటరమణ, పంచాయతీ కార్యదర్శి కామేశ్వరరావు, ఎపిఎం ప్రమీల, తెంబవాసు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సర్పంచ్ జోగారావు

ధాన్యం కొనుగోలు వేగవంతం

కవిటి: మండలంలోని ధాన్యం కొనుగోల్లు వేగవం తం చేయాలని ఎంపిపి కడియాల పద్మ, ఎఎంసి చైర్మన్ దువ్వ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పిఎసిఎస్, వ్యవసాయ సిబ్బందితో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే పండించిన ధాన్యంతో కళ్లాల వద్ద రైతులు ఎదురుచూస్తున్నారని, సాంకేతిక సమస్యలు పరిష్కరించి వెంటనే ధాన్యం మిల్లులకు తరలించాలని సూచించారు. కృష్ణారెడ్డి మాట్లాడుతూ మండలానికి చెందిన ధాన్యం కోసం ఇచ్ఛాపురం మండలం ముచ్చింద్ర మిల్లు ట్యాగ్ చేశారని, కానీ, అప్పటికే ఆ మిల్లుకి ఇచ్ఛాపురం మండలం ధాన్యం తరలిస్తుండడం, అక్కడకు వెళ్లేందుకు కవిటి నుంచి సుమారు 50 కిలో మీటర్లు పైబడి దూరం కావడంతో సమస్యలు ఎదురవుతున్నట్లు తెలిపారు. రైతుల శ్రేయస్సు దృష్ట్యా ముచ్చింద్ర మిల్లు ట్యాగ్ తొలగించి సోంపేట, కంచిలిలో ఉన్న మిల్లులు వెంటనే ట్యాగ్ చేయాలని సూచించారు. ఏదేమైనా సోమవారం నుంచి పూర్తిస్థాయిలో మండలం నుంచి ధాన్యం కొనుగోళ్లు చేయాలని సూచించారు. సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు, కో-ఆప్షన్ మెంబర్ పాండవ శేఖర్, ఎంపిటిసి పూడి నీలాచలం, ఎంపిటిసి ప్రతినిధి దుద్ది ధర్మారావు, డిటి టి.రామచంద్రరావు, హెచ్‌ఒ పి.మాధవీలత, ఇఒపిఆర్‌డి శివాజీ పానిగ్రాహి, ఎఒ ఎస్.ప్రసాదరావు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి


భూ హక్కు పత్రాలను అందజేస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

భూహక్కు పత్రాల పంపిణీ

రణస్థలం: స్వాతంత్ర్యం వచ్చి ఎన్నో ప్రభుత్వాలు అధికారం చేపట్టినా ఇటువంటి శాశ్వత పథకాలు ప్రభుత్వాలు చేయలేదని ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ అన్నారు. స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మండలంలోనిరావాడ పంచాయతీ ఉప్పివలస రైతులకు వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూహక్కు-భూ రక్ష పత్రాలను శనివారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో తహశీల్దార్ సనపల కిరణ్‌కుమార్, ఆర్ఐ శ్రావణి, సర్వేయర్ రవి, వైస్ ఎంపిపి మైలపల్లి కామరాజు, ఎంపిటిసిలు కిల్లారి సూర్యనారాయణ, రెడ్డి వాసు పాల్గొన్నారు.

ఎంపిడిఒగా రవీంద్రబాబు

బూర్జ : ఎంపిడిఒ ఎం.రవీంద్రబాబు శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేసిన ఎంపిడిఒ కె.సురేష్‌కుమార్ సెలవు పెట్టారు. సరుబుజ్జిలి ఇన్‌ఛార్జి ఎంపిడిఒగా పనిచేస్తున్న రవీంద్రబాబును ఇక్కడకు బదిలీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బూర్జ మండలంపై అన్ని విధాలా అనుభవం ఉందని, ఇటువంటి ఇబ్బందులు లేకుండా ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అందజేస్తానని తెలిపారు.


రవీంద్రబాబు, ఎంపిడిఒ

వస్తువుల కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

వస్తువుల కొనుగోలు విషయంలో వినియోగదారులు తగిన జాగ్రత్తలను పాటించాలని వినియోగదారుల సంఘం జిల్లా అధ్యక్షులు ప్రగడ రాంబాబు పేర్కొన్నారు. నగరంలోని ఆర్‌టిసి కాంప్లెక్స్ ఆవరణంలో వినియోగదారుల దినోత్సవం సందర్భంగా వినియోగదారుల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతి వస్తువూ కొనుగోలుకు రసీదు తప్పక పొందాలన్నారు. ఏదైనా కొనుగోలు విషయంలో ఈ రసీదు తప్పక ఉపయోగపడుతుందన్నారు. వినియోగదారుల హక్కుల గురించి రోజువారి కొనుగోలు చేసే వస్తువుల విషయంలో జాగ్రత్తలను వివరించారు. అదేవిధంగా వినియోగదారుల చట్టం 2019 గురించి అవగాహన కల్పించారు. వస్తువుల నాణ్యత విషయంలో వినియోగదారుల చట్టం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పైడి నవీన్, ఉపాధ్యక్షులు రమేష్ జాయింట్ సెక్రెటరీ వెంకట్ (నాని), పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు మోహన్‌కుమార్, భాస్కర్, సభ్యులు ఎం.వి.ఎస్.ఆర్.ప్రసాదరావు, దిలీప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

ప్రభుత్వ భవన నిర్మాణాలు వేగవంతమయ్యేలా చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేక అధికారి టి.భవానీశంకర్ సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో, సిబ్బందితో శనివారం సమీక్షించారు. నిర్మాణాల ప్రగతిపై అధికారులకు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పనులపై అలసత్వం వహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎప్పటికప్పుడు భవన నిర్మాణ పనులను పరిశీలించారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికితీసుకొస్తే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.చంద్రకుమారి, వివిధ శాఖల ఇంజినీర్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


మాట్లాడుతున్న భవానీశంకర్


లబ్ధిదారులతో మాట్లాడుత్ను యశోద, జోగారావు

వేరేచోట ఇళ్ల స్థలాలు ఇప్పించాలి

సోంపేట : బారువ మేజర్ పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీ రెండో లేఅవుట్‌లో మంజూరు చేసిన ఇళ్ల స్థలాలు నిర్మాణానికి అనువైనవి కావని, తమకు వేరేచోట ఇళ్ల స్థలాలు ఇప్పించాలని లబ్ధిదారులు కోరారు. ఈ మేరకు జడ్పిటిసి తడక యశోద, పలాసపురం సర్పంచ్ తడక జోగారావులకు శనివారం ఫిర్యాదు చేశారు. తమకు కేటాయించిన స్థలం నిబంధనలకు విరుద్ధంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు వేరే చోట స్థలాలు మంజూరు చేసి, న్యాయం చేయాలని కోరారు. దీనికి స్పందించిన ఆమె ఈ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను పరిష్కరిస్తానని హామీనిచ్చారు.

కుమార్‌నాయక్‌కు అవార్డు

పలాస: విజయవాడ నందమూరి తారక రామారావు కళా క్షేత్రంలో ప్రపంచ తెలుగు రచయితల ఐదో మహాసభ ఇటీవల నిర్వహించారు. తెలుగు రచయితల మహాసభకు సాంస్కృతిక రంగ ప్రతినిధిగా వక్త కాశీబుగ్గకు చెందిన డాక్టర్ కుమార్‌నాయక్‌కు అవార్డు లభించింది. ఈ అవార్డును అధికార తెలుగు భాష సంఘం మాజీ అధ్యక్షులు మండలి బుద్ధప్రసాద్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు.


అవార్డును అందుకుంటున్న కుమార్ నాయక్